

ముదినేపల్లి - గుడివాడ ఎన్‌హెచ్‌లో బరకాలు కప్పిన ధాన్యం బస్తాలు

నలుపు రంగులో ధాన్యం

రంగు మారుతున్న ధాన్యం

- ఇప్పటికే తేమశాతం పేరిట బస్తాకు సుమారు 250 వరకు కోత
- ధాన్యం రంగు మారితే ధర మరింత తగ్గే ప్రమాదం

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాల కారణంగా ముదినేపల్లి ప్రాంతంలో నేలకొరిగిన సార్వా వరి పైరుకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. సుమారు నెల రోజులుగా వరి పైరు పొలాల్లోనే ఉండడం, తరచూ వర్షాలు పడుతుండటంతో తడిసిన ధాన్యం పాడైపోతోంది. వందలాది ఎకరాల్లోని వరి పైరు కోసే అవకాశం లేకపోయింది. రెండు రోజుల క్రితం చినపాలపర్రు ఏరియాలో కోసిన వరి పైరు నుంచి వచ్చిన ధాన్యం ముక్కిన వాసన వస్తోంది. తేమ శాతం తగ్గేందుకు ఆ ధాన్యాన్ని రోడ్ల వెంబడి ఆరబెట్టారు. ముక్కిన ధాన్యం ఎక్కువ రోజులు ఆరబెడితే గింజ చితికి పొడి అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వాతావరణ తెరపి ఇవ్వడంతో ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టడం ప్రారంభించారు. సంచుల్లో నింపి ఎక్కువ రోజుల నిల్వ ఉంచిన ధాన్యం కూడా పాడైపోతున్నదని చెబుతున్నారు. తేమ పేరుతో బస్తా ధాన్యానికి రూ.200 నుంచి 250 వరకు మిల్లర్లు కోత విధిస్తుండగా, ధాన్యం రంగు మారితే ధర మరింత తగ్గుతుందేమోనన్న భయం రైతుల్లో కలుగుతోంది.



ముదినేపల్లి ప్రాంతంలో ముక్కిన వాసన వస్తున్న ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

అజాగ్రత్తే ప్రమాద హేతువు

జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్



ఇంటర్వ్యూ..

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మనిషి ప్రాణం ఎంతో విలువైంది. కొద్దిపాటి అజాగ్రత్తతో క్షణాల్లో ఆ ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణం పోయిన వ్యక్తిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి, ప్రాణాలు కాపాడడానికి నిత్యం ప్రజలకు అవగాహన కల్పించడానికి చర్యలు చేపడుతున్నామని రవాణా శాఖ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు.

రవాణాశాఖ అందించే సేవలు ఏమిటి?

డీటీసీ : వాహన్ అప్లికేషన్‌లో వాహనాల వివరాలు, సేవలు పొందుపర్చడమే కాకుండా దేశవ్యాప్తంగా సారథి అప్లికేషన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా అన్ని లావాదేవి, దరఖాస్తులు ఉండడం వల్ల సులభతరంగా సేవలు ప్రజలకు అందిస్తున్నాం.

జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి ?

ఐదు లక్షల 87 వేల వాహనాలు ఉన్నాయి. వీటిలో మూడులక్షల 86 వేలు మోటారు సైకిళ్లు, 40 వేల కార్లు, 21 వేల ఆటో రిక్షాలు, లారీలు 18 వేలు, స్కూలు బస్సులు 1600, అంబులెన్సులు 253 ఉన్నాయి.

రహదారి భద్రతపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ?

ఖచ్చితంగా రహదారి భద్రత నియమాలు పాటించాలి. ప్రతిరోజు వాహన డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ద్విచక్ర వాహ నదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహన దారులు సీటు బెల్టు ధరించాలి. దీనివల్ల ప్రమాదం జరిగినా ప్రాణాలు కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఈ ఏడాది ఎన్ని ప్రమాదాలు జరిగాయి?

ఈ ఏడాది 475 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 241 మంది ప్రాణాలు కోల్పోయారు. 510 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదాలకు గురైనట్టు గుర్తించాం. జిల్లాలో 33 ప్రాంతాలు రోడ్డు ప్రమాదాలు జరిగేవిగా గుర్తించాం. 17 ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు ఇప్పటికే తీసుకున్నాం. మిగిలిన వాటి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు కొనసాగుతున్నాయి.

అవగాహన కార్యక్రమాలు ఏ విధంగా చేస్తున్నారు?

ప్రతి రోజు మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు వాహనాలు తనిఖీ చేస్తు వాహన డ్రైవర్లకు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని స్కూళ్లు, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సదస్సులు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణ నియమ నిబంధనలను తెలియజేస్తున్నాం.

మారిన చట్టాలు ప్రకారం జరిమానాలు ఏ విధంగా ఉన్నాయి?

మద్యం తాగి వాహనం నడిపితే రూ.పది వేలు, హెల్మెట్ ధరించక పోతే రూ.వెయ్యి జరిమానా, మైనర్లు వాహనాలు నడిపితే రూ.పది వేలు జరి మానా, తల్లిదండ్రులపై కేసు. ట్రిపుల్ రైడింగ్ అయితే రూ.1500 జరిమానా లేదా మూడేళ్ల జైలు శిక్ష. ఇన్సూరెన్సు లేకపోతే రూ.రెండు వేలు, డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే రూ.ఐదు వేలు జరిమానా విధిస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు ద్విచక్ర వాహనదారులకు కోటి 70 లక్షల రూపాయలు జరిమానాలు విధించాం.

ఎలక్ట్రిక్ వాహనాలకు డ్రైవింగ్ లైసెన్సు అవసరం లేదా?

35 వాట్స్ మోటారు కెపాసిటి కల్గిన వాహనాలకు డ్రైవింగ్ లైసెన్సు అవసరం లేదు. 35 వాట్స్ కెపాసిటీ దాటిన ప్రతి వాహనాన్ని నడపడానికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు పొందాలి. ఇలాంటి అపోహలు ఎవరు నమ్మవద్దు.

జిల్లాలో రవాణాశాఖ సిబ్బంది ఎంత మంది ఉన్నారు?

జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా మొత్తం మీద డీటీసీ ఒకరు, ఆర్టీవో ఇద్దరు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆరుగురు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు 12 మంది, హెడ్ కానిస్టేబుళ్లు ఇద్దరు ఉన్నారు. కానిస్టేబుల్ పోస్టులు 11 ఉండగా, 11 ఖాళీగానే ఉన్నాయి. హోంగార్డు యూనిట్ నుంచి హోంగార్డులను డిప్యూటేషన్‌పై సేవలు వినియోగించుకుంటున్నాం.

ప్రైవేటు అంబులెన్సుల దోపిడీపై ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో 253 అంబులెన్సులు ఉన్నాయి. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని రోగులు, మృతుల బంధువుల నుంచి అధిక సొమ్ములు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. నిర్ణయించిన ధరల కంటే ఎవరైనా అంబులెన్సులకు ఎక్కువ ధరలు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

జిల్లా ప్రజలకు మీరు ఇచ్చే సూచన

రవాణాశాఖకు సంబంధించి ఏ సేవ అయినా ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఏ సమస్య వచ్చినా కార్యాలయానికి వెళ్లి సంప్రదించి పరిష్కరించు కోవచ్చు. దళారీ వ్యవస్థను, ప్రైవేటు వ్యక్తులను సంప్రదించవద్దు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరు రవాణాశాఖ నియమ నిబంధనలు పాటించి రోడ్డు భద్రతను గుర్తెరిగి సుఖ ప్రయాణాన్ని కొనసాగించాలి. ఏ విధమైన ఇబ్బందులు ఉన్నా నేరుగా నన్ను సంప్రదించవచ్చు.

నేటి నుంచి 'ఓపెన్' టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఫీజుచెల్లింపునకు వెసులుబాటు

ఏలూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకానున్న అభ్యాసకులు పరీక్ష ఫీజును అపరాధ రుసుం లేకుండా సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు, తత్కాల్ పథకం కింద టెన్త్ పరీక్షలకు రూ.500, ఇంటర్ పరీక్షలకు రూ.1000 అపరాధ రుసుంతో కలిపి ఫీజు చెల్లించేందుకు జనవరి 10వ తేదీ వరకు గడువు ఉందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పరీక్ష ఫీజుగా ఇంటర్ థియరీ సబ్జెక్టు ఒక్కింటికి రూ.150, ప్రాక్టికల్ ఒక్కింటికి రూ.150, పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజులను ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీసెంటర్లను, డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పేదోడికి.. పట్టెడన్నం!



ఏలూరు అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న అన్నార్తులు



ఏలూరులో అన్న క్యాంటీన్ వద్ద..

అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

- వైసీపీ ప్రభుత్వంలో మూసివేత
- కూటమి ప్రభుత్వం రాకతో అన్నక్యాంటీన్లకు జవసత్వాలు
- పేద వర్గాల్లో వెల్లివిరుస్తున్న సంతోషం

అన్నార్తుల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు మళ్లీ తెరచుకోవడంతో సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అన్న క్యాంటీ న్లను మూసి వేశారు. అయితే రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే అన్నక్యాంటీన్ల వ్యవస్థను పునఃప్రారంభించింది. అన్నక్యాంటిన్లు అందుబాటులోకి రావడంతో పేద, సామాన్య తరగతి ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.



ఏలూరు సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మూడుపూటలా రుచికరమైన భోజనం అందించే బాధ్యతను అక్షయ పాత్ర ఫౌండేషన్ వంట శాలకు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్లు మూసివేసినా టీడీపీ నేతలు స్వచ్ఛందంగా గత ఐదేళ్లుగా వాటిని నడిపి పేద వర్గాల ఆకలి తీర్చారు. పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లకు పూటపూటకు ప్రజాదరణ పెరుగుతూ వస్తోంది. ఇక్కడ అందించే భోజనంపై మంచి స్పందన కనిపిస్తోంది. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటున్నాయని, కేవలం నామమాత్రపు ధరకే వీటిని అందించడం వల్ల జిల్లా కేంద్రానికి వివిధ సమస్యలు తెలపడానికి వచ్చే పేదలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతోంది.

జిల్లాలో ఆరు క్యాంటీన్లు

జిల్లాలో అన్న క్యాంటీన్లను ఏలూరు నగర పాలక సంస్థతో పాటు నూజివీడు, చింతలపూడి మునిసిపాలిటీల్లో మొత్తం ఆరు ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పా టు చేసినా రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏలూరు నగరంలో ఇండోర్ స్టేడియం, ఆర్ఆర్‌పేట, తంగెళ్ళమూడి, రామ కోటి ప్రాంతాల్లో, జంగారెడ్డిగూడెం, నూజివీడు మునిసిపల్ కార్యాలయాల ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

అన్న క్యాంటీన్లలో మెనూ



ఇక్కడ ప్రతి రోజు ఉదయం కేవలం రూ.5లకే అల్పాహారంగా ఇడ్లీ, పూరి, ఉప్మా, పొంగల్ వీటిలో ఏదైనా ఒకటి అందిస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోనాల్లో వైట్ రైస్, కూర, పప్పు/సాంబారు, పెరుగు పచ్చడి మెనూతో కేవలం రూ.5లకే అందిస్తున్నారు. అన్న క్యాంటీన్‌లో ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3గంటల వరకు భోజనం, తిరిగి రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు రాత్రి పూట భోజనం అందిస్తున్నారు. ప్రతి క్యాంటీన్‌లో ఉదయం పూట అల్పాహారం 200 మందికి, మధ్యాహ్నం 300 మందికి, రాత్రి పూట 300 మందికి భోజనం అందిస్తున్నారు. ఒక్కొక్కరికి మూడు పూటలా ఆహారం అందించేందుకు ఖర్చు రూ.90లు అవుతుండగా కేవలం రూ.15 వసూలు చేస్తూ మిగిలిన రూ.75 ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తోంది.



ఆస్పత్రికి వచ్చి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశాం..



ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మా బంధువును పరామర్శించడానికి వచ్చాం. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని అన్న క్యాంటీన్‌లో మధ్యాహ్నం పూట వైట్ రైస్, కూర ,పప్పు, సాంబారు , పెరుగు, పచ్చడితో కేవలం రూ.5లకే భోజనం చేశాం. మాలాంటి పేదవారికి తక్కువ ధరకు నాణ్యమైన భోజనం ఈ నగరంలో లభించటం మా అదృష్టం.

– కరప సత్యనారాయణ దంపతులు, తడికలపూడి

వ్యవసాయ కూలీలకు ఎంతో ఉపయోగం



అన్న క్యాంటీన్‌లో అల్పాహారం చేశాం.ఎంతో రుచికరంగా ఉంది. మాలాంటి వ్యవసాయ కూలీలకు ఇది ఎంతో ఉపయోగం. నేను ఏలూరుకు పనిపై ఉదయం వచ్చాను. బయట ఉన్న ధరలు చూసి టిఫిన్ తినడంపై కొద్దిగా ఆలోచనలో పడ్డాను. అదే సమయంలో ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని అన్న క్యాంటీన్‌లో అల్పాహారం అందించడం గమనించి అక్కడికి వెళ్లి రూ.5లకే రుచికరమైన అల్పాహారం తిన్నాను.

– కర్రా శంకరరావు, ధర్మాజీగూడెం

దర్జాగా భూ ఆక్రమణ

- వారం రోజులుగా రావిచర్ల నల్లగట్టు పైకి ర్యాంపు
- కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆగని ఓ వైసీపీ నాయకుడి దూకుడు
- అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల అండదండలు
- పనులను అడ్డుకున్న గ్రామస్థులు
- సబ్ కలెక్టర్, తహసీల్దార్‌కు సమాచారం
- ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

నూజివీడు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలంలో భారీ భూ ఆక్రమణకు కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కలిసి ప్రయత్నాలు చేపట్టారు. దీనిని గమనించిన గ్రామస్థులు భూ ఆక్రమణలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుని సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలపడంతో భూ ఆక్రమణ పర్వానికి తాత్కాలికంగా తెరపడింది. దీనికి సంబంధించిన వివరాలివి.. నూజివీడు మండలం రావిచర్ల నల్లగట్టు ప్రాంతంలో నూజివీడు పట్టణానికి చెందిన ఓ ప్రముఖుడు, వైసీపీ నాయకుడికి రెండు ఎకరాల భూమి ఉంది. దానికి అనుబంధంగా మరో ఆరు ఎకరాల బీఫాం భూమిని కొనుగోలు చేసిన అతడు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పక్కనే ఉన్న నల్లగట్టు శిఖర భాగంలో చెట్లను తొలగించి తనకు అనుకూలంగా మొక్కలను నాటుకుంటూ భూఆక్రమణల పర్వానికి తెరలేపాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఆ భూఆక్రమణల పర్వం ఆగలేదు. నూజివీడుకు చెందిన కొందరు టీడీపీ నాయకుల అండదండలతో ఏకంగా నల్లగట్టుపైకి వారంరోజులుగా ర్యాంప్‌ను వేస్తున్నారు. అయితే ఇది గమనించిన రావిచర్ల గ్రామస్థులు ర్యాంప్ వేయడాన్ని నిలుపుదల చేయాలంటూ ఆదివారం పనులను అడ్డుకున్నారు. సమాచారాన్ని నూజివీడు సబ్ కలెక్టర్, నూజివీడు తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లడంతో పనులను నిలుపుదల చేయించిన రెవెన్యూ అధికారులు ర్యాంప్ వేసేందుకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. సోమవారం నల్లగట్టు ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు చేపట్టనున్నట్టు నూజివీడు తహసీల్దార్ సుబ్బా రావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



రావిచర్ల నల్లగట్టుకు ర్యాంప్ వేస్తున్న ఎక్స్‌కవేటర్

మూడు పేర్లు.. ముగ్గురు భార్యలు

- నిందితుడిగా అనుమానిస్తున్న శ్రీధర్‌వర్మను సూత్రధారిగా తేల్చిన పోలీసులు
- యండగండి మృతదేహం పార్శిల్ కేసులో పురోగతి
- మృతదేహం ఎవరిది?
- హత్య చేసి మృతదేహాన్ని తెచ్చారా..?

- వివరాలు మెయిన్

వాష్ రూంలో విద్యార్థినుల ఫొటోలు తీసిన ఆకతాయిలు

7

విద్యార్థిని ప్రసవం ఘటనలో ఇద్దరి అరెస్టు

పనిభారం తగ్గించండి

పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘం

ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులపై ఇటీవల ఒత్తిడి, పనిభారం ఎక్కువైందని, పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ కార్యదర్శులపై అధికారుల ఒత్తిడితో పాటు పనిభారం ఎక్కువైందని, ఫలితంగా పలువురు కార్యదర్శులు అనారోగ్యం పాలైయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతినెల అందించే పింఛన్‌ను ఉదయం 5.30 నిమిషాలకే ప్రారంభించమంటున్నారని ఈ సమయాన్ని 8 గంటలకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సెలవు దినాల్లో పింఛన్లు పంపిణీ చేపట్టరాదని కోరారు. గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో ఖాళీ అయిన సిబ్బందిని భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యదర్శి కె.వి.ఎల్ తనూజ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. పంచాయతీలో అవకతవకలు జరిగితే విచారణకు మరో పంచాయతీ కార్యదర్శిని విచారణ అధికారిగా నియమించటం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఏదైనా విచారణ చేయాల్సి వస్తే డీపీవో కార్యాలయం సిబ్బందిచేత విచారణ చేయించాలని తెలిపారు. తమ సమస్యలపై త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. గౌరవాధ్యక్షుడు వి.జి.ఎం.వి.ఆర్ కృష్ణారావు, ఉపాధ్యక్షు రాలు వసంతవాణి, గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

వాహనాల తనిఖీలు



ఏలూరులో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేరాల నియంత్రణ కోసం పోలీసులు రాత్రి వేళ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వాహన డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాంప్‌ల వద్ద ఒంటరి మహిళలకు రక్షణ కల్పించేం దుకు ప్రత్యేక బృందాలు గస్తీలు నిర్వహించారు. నేరస్తులపై నిఘా పెట్టి లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు తనిఖీలు చేసి అనుమానితులను ప్రశ్నించారు.



వేంకటేశ్వరస్వామి వారికి తులసి ఆకులు సమర్పిస్తున్న అర్చకులు

కాళ్ళకూరు వెంకన్నకు లక్ష తులసిపూజ



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

కాళ్ళ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు లక్ష తులసి పూజ ఆదివారం నిర్వహించారు. ధనుర్మాసం పవిత్ర సప్తమి పర్వదినం పురస్కరించుకుని ఉదయం లక్ష తులసి పూజ, మధ్యాహ్నం అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన, సాయంత్రం సుగంధ పరిమళ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, నీరాజన మంత్ర పుష్పములు దేవస్థానం ఆస్థాన వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ వర్మ, అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం అఖండ అన్నసమారాధన జరిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహుడికి రూ.6లక్షల వాహనం వితరణ



దాత అందించిన గరుడ వాహనం

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనారసింహునికి సుమారు రూ.6 లక్షలు విలువైన వాహనాలను దాత అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ వాహనాలను స్వామి వారి సేవలకు వినియోగించాలని కోరారు. ఆలయ అర్చకులు ముందుగా వాటి వద్ద ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, పర్యగ్నికరణం, వాస్తుహోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పూజలు చేసి శ్రీకనకవల్లీ సమేత లక్ష్మీనారసింహుని ఉత్సవ విగ్రహాలను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో కోవెల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ధనుర్మాస ఉత్సవం



గోదాదేవితో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధనుర్మాస ఉత్సవం ఆదివారం క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేసారు. అనంతరం గజ, అశ్వ సేవలతో పాటు మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో గోదాదేవితో సహా శ్రీవారి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చి ప్రసాదవితరణ చేశారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి బెంగళూరు సంస్థ అవార్డు



బెంగళూరులో అవార్డు అందుకున్న వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి బి.గోపాల్ మొక్కల రక్షణపై అవార్డు అందుకున్నారు. బెంగళూరుకు చెందిన ఎన్‌సెక్ట్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఉత్తమ మొక్కల రక్షణ అవార్డు ప్రకటించింది. బెంగళూరులో ఈనెల 21న నిర్వహించిన అబ్రహం వర్గీస్ ఇన్‌సెక్ట్, నేచర్ ట్రస్ట్ అవార్డు వేడుకలో ఆయనకు అవార్డు అందించారు. ఉపకులపతి గోపాల్ తీపి నారింజ, పులుపు నిమ్మ, ఉల్లి, పసుపు సుగంధ ద్రవ్యాల అభివృద్ధిలో అందించిన సేవలకు ఈ అవార్డు అందించారు. వీసీ గోపాల్‌ను వర్సిటి అధికారులు, అధ్యాపకులు అభినందించారు.



నరసాపురంలో విద్యుత్ కాంతుల్లో చర్చి



మునునూరులో చిన్నారుల సందడి

క్రిస్మస్ వెలుగులు

నరసాపురం టౌన్, మునునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల క్రిస్మస్ సందడి నెలకొంది. పట్టణ, గ్రామాల్లో పలు ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలకరించారు. నరసాపురంలో ప్రసిద్ధిగాంచిన లూథరన్, బెతెస్థ, జీడీఎం, పెంతికోస్తు, టీబీసీ సంఘాలతో పాటు మండలంలోని సరిపల్లి, మల్లవరం, లిఖితపూడి, చిట్టవరం, లక్ష్మణేశ్వరం, ఎల్‌బిచర్ల, సీతారాంపురం, పసలదీవి, కొత్త నవరసపురం గ్రామాల్లోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రార్థనలు అనంతరం ప్రేమ విందులు నిర్వహిస్తున్నారు. మార్కెట్ కళకళలాడింది. బట్టల దుకాణాలు, స్వీట్ షాపు, బేకరీ వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. మునునూరులో బెరాకా ప్రార్థన మందిరంలో చిన్నారులు సందడి చేశారు.



దేశానికి అన్నం పెట్టే రైతన్న పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది. దేశాన్ని రక్షించే జవానులు, ప్రజలకు అన్నంపెట్టే రైతులను ఉటంకిస్తూ జై జవాన్.. జైకిసాన్ నినాదం రైతుల విషయంలో సంతోషదాయకంగా మాత్రమే మిగిలింది. రైతులకు ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలవలేకపోతున్నాయి. జమిందారి చట్టం రద్దు కౌలు దారీ చట్టం అమలు సమగ్ర సాగునీటి ప్రాజెక్టులు వంటివాటికి రూపకల్పన చేసి రైతు బంధుగా పేరుగాంచిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని 2001 నుంచి డిసెంబరు 23 జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రైతు సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఆరుగాలం శ్రమ

• నేడు రైతు దినోత్సవం



ఆదాయం భ్రమ

• ప్రకృతికి ఎదురీదుతున్న రైతు • అతివృష్టి, అనావృష్టితో కష్టాలు
• ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలి • గిట్టుబాటు ఉండాలి
• రైతులకు పింఛన్ ఇవ్వాలి

పాలకొల్లు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరితోపాటు వాణిజ్య పంటలు పండించే రైతులు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో ఎదురీదుతున్న రైతులు ఆరుగాలం శ్రమించినా ఆదాయం భ్రమగానే మిగులుతున్నది. వ్యవసాయం జూదంగానే మారిందని చెప్పవచ్చు. వర్షాకాలం, శీతాకాలం, వేసవి కాలంతో నిమిత్తం లేకుండా తుఫానులు చుట్టుముట్టేస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి కన్నెర్రచేస్తుంది. దీంతో అప్పులు బాదలు పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

కౌలు రైతు పరిస్థితి దుర్భరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 80 శాతం పైబడి కౌలు రైతులే ఉన్నారు. సామాన్య మధ్య తరగతి రైతులు సైతం సాగు చెయ్యలేక ఇంటిల్లిపాది వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు తమ పొలాలను కౌలుకు ఇస్తున్నారు. భూమిపై కౌలు రైతులకు పూర్తి హక్కులేకపోవడంతో ప్రభుత్వపరంగా రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. పంట దక్కకపోతే ఆత్మహత్యలకు పాల్పడుతున్నరు. కౌలుదారీ చట్టాలతో కౌలు రైతులకు మేలు జరగకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది.

వ్యవసాయానికి యువత దూరం

వ్యవసాయం చెయ్యడానికి యువత ఆసక్తి చూపించడం లేదు. జిల్లాలో 90 శాతం రైతులు 40 ఏళ్ల పైబడినవారే. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో యువత వ్యవసాయంపై మక్కువ చూపించడం లేదు. దీంతో భవిష్యత్ తరంలో సాగు ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉంది. యువతకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు వస్తే యువ రైతులు పెరిగే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధర లేదు

రైతులు పండించే వివిధ పంటలతో పాటు వాణిజ్య పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ప్రముఖ హీరో నటించిన సినిమా విడుదలైతే ఇష్టానుసారం టిక్కెట్ ధరలు పెంచుకోడానికి అనుమతిస్తున్న ప్రభుత్వాలు రైతు పండించిన పంట నష్టం లేకుండా అమ్ముకోవడానికి అనుమతివ్వాలని కోరుతున్నారు. రైతులకు వెన్నదన్నుగా నిలవాల్సిన ప్రభుత్వాలే మొండి చెయ్యి చూపిస్తున్నాయి. రెండు దశాబ్దాల ధరలు పరిశీలిస్తే సాగు వ్యయం 200 శాతం పెరగగా పంట ఉత్పత్తులు పెరిగింది 50 శాతం మాత్రమే.

రైతులకు పింఛన్ ఇవ్వాలి

పదవీ విరమణ చేసిన ప్రభుత్వోద్యోగులకు పింఛను ఇచ్చిన మాదిరి 60 ఏళ్ల పైబడిన రైతులకు పింఛన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం అంతంత మాత్రమే. వృద్ధాప్యంతో సాగుకు దూరమైన రైతుకు అసలు ప్రోత్సాహమే లేదు. సంక్షేమానికి పెద్దపీట వెయ్యడం ద్వారానే వ్యవసాయం మనగలుగుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గుర్తింపు లేదు..!

జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక టీమ్ ఏర్పాటు చేసి రైతులకు క్షేత్రస్థాయిలో సూచనలు సలహాలు ఇవ్వడం. సాంకేతిక అంశాలను తెలియజేయడం, వ్యవసాయాదికారులు రైతులకు అందుబాటులో ఉండడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. 2001 నుంచి ఏటా డిసెంబరు 23న జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో గ్రామాలు, మండలాల వారీగా ఆదర్శ రైతులను గుర్తించి గౌరవించడం, కనీసం ప్రత్యేక సందర్భంలోనైనా రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు లేకపోవడంపై విమర్శలు వినబడుతున్నాయి.

నేడు ప్రతి సందర్భానికి దినోత్సవం నిర్వహించి ఆర్భాటం చేస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం, వృద్ధుల దినోత్సవం, తల్లులు దినోత్సవం, తండ్రుల దినోత్సవం, పురుషుల దినోత్సవం ఏడాదిలో 365 రోజులకు సరిపడా దినోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికి రైతు దినోత్సవం ప్రజలలోనికి తీసుకెళ్లడానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించి రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని పలువురు కోరుతున్నారు.



యువ రైతులను ప్రోత్సహించాలి

వ్యవసాయం చేసేవారిలో 40 ఏళ్ల వయసు పైబడిన వారే అధికం. యువత 10శాతం కూడా లేరు. యువ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. వ్యవసాయ కార్మికులు తగ్గుతున్నందున రాయితీపై వ్యవసాయ యంత్రాలను అందించాలి. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. వాణిజ్య ఉత్పత్తులను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు నిర్మించాలి.

- తాళ్లూరి శ్రీనివాస్, రైతు, శివదేవునిచిక్కాల





పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కొత్త సినిమా టిక్కెట్లు ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకోడానికి ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. రైతు పంట గిట్టుబాటు ధరకు అమ్ముకునే అనుమతి లేదు. రానున్న రోజుల్లో రైతులు కనుమరుగయ్యే పరిస్థితులున్నాయి. రైతు శ్రేయస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. దేశానికి రైతే వెన్నుముక, ప్రభుత్వాలు రైతుకు వెన్నుదన్నుగా నిలవాలి.

- మండెల నాని, రైతు, గోరింటాడ

సన్నిహితురాలి ఇంట్లోనే చోరీ

18 కాసుల బంగారం.. రూ.1.5 లక్షల నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాళీచరణ్

భీమవరం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్, జూదం, వ్యసనాలకు అలవాటు పడిన వ్యక్తి తన సన్నిహితురాలి ఇంట్లోనే బంగారం, నగదు అపహరించి పోలీసులకు పట్టుబడ్డాడు. భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. భీమవరం మండలం ఎల్‌విఎన్ పురం గ్రామానికి చెందిన వీరవల్లి కృష్ణమోహన్‌కు భీమవరం బలుసుమూడికి చెందిన పాతర్లపల్లి మాలతితో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. మాలతి భర్తకు దూరంగా ఉంటూ సున్నం అంజనేయులు అపార్ట్‌మెంట్ ఏజీ-4లో నివాసం ఉంటుంది. వారిద్దరి మధ్య సన్నిహితం ఏర్పడింది. ఇదిలా ఉండగా వ్యసనాలకు బానిస అయిన కృష్ణమోహన్ దొంగతనం చేయాలని నిర్ధారించుకున్నాడు. మాలతి జూన్ 1న ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. అది గమనించిన కృష్ణమోహన్ అదే నెల 4న మాలతి ఇంటి తాళాలు పగులగొట్టి 18 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.5లక్షల నగదు అపహరించాడు. బీరువాలో బట్టలు చిందరగా పడవేసి ఇంట్లో కారం చల్లి దొంగలు దొంగతనం చేసినట్లు చేసి వెళ్ళిపోయాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన మాలతి ఇంట్లో దొంగలు పడ్డారని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణమోహన్ మాత్రం ఏమీ తెలియనట్లుగా మాలతి వద్దకు వెళ్ళి ఓదార్చేవాడు. దొంగిలించిన సొమ్మును అవసరాలకు వాడుకుని బంగారాన్ని విక్రయించడానికి ఈ నెల 21న పాత బస్టాండ్ వద్ద తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించడానికి జిల్లా ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి డీఎస్‌పి జయసూర్య ఆధ్వర్యంలో సీఐ కాళీచరణ్, ఎస్ఐ రెహ్మాన్, ఏఎస్ఐ వర్మ, హెచ్‌సి గోవిందరాజులు, సిబ్బంది గోపి, నరేష్ కృషి చేశారు. అధికారులు అభినందించి నగదు బహుమతులను ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ రెహ్మాన్, ఏఎస్ఐలు వర్మ, స్వామి, సిబ్బంది నరేష్, గోపి, గోవిందరాజు తదితరులు ఉన్నారు.

పార్శిల్ మృతదేహం సమాచారం తెలిస్తే చెప్పండి



ఉండి మండలం యండగండికి పార్శిల్‌లో వచ్చిన మృతదేహం

• ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

భీమవరం క్రైం / ఉండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉండి మండలం యండగండిలో ముదునూరి రంగరాజు ఇంటికి ఈ నెల 19న చెక్క పెట్టెలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పార్శిల్ వచ్చింది. మృతదేహం ఆనవాళ్లు ఎస్పీ నయీమ్ అస్మి, ఉండి ఎస్ఐ నజీరుల్లా ఆదివారం వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చు. ఎత్తు 5.8 అడుగులు, పొడుగు చేతుల నలుపు రంగు స్వెట్టర్, సగం చేతుల ఆకుపచ్చ రంగు టీషర్ట్, షర్ట్ ముందు భాగంలో 'బ్రాను ఓరియెంటల్ అర్‌మోర్' అనే ఇంగ్లిష్ అక్షరాలు ఉన్నాయి. నలుపు రంగు కట్ చేసిన ప్యాంటు కలదు. పురుషుడి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నది. సుమారు ఈ నెల 16/ 17 తేదీల్లో చనిపోయి ఉండవచ్చు అని పోలీసులు భావిస్తున్నారు. ఈ నెలలో 30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు కనబడకుంటే ఉండి, ఆకివీడు, భీమవరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 9154966497, 9440796648, 9154966508 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు అధికారులు కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 270గ్రాములు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలోని పెదతాడేపల్లి జాతీయ రహదారి సమీపంలో తాడేపల్లిగూడెంకు చెందిన హర్షవర్దన్, మణికంఠ గంజాయితో ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడ నిఘా పెట్టగా హర్షవర్ధన్, మణికంఠల వద్ద మంజాయి సస్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా ఉంచామని, వినియోగిస్తున్న వారి సమాచారం తెలిసిన వారు పోలీసుకు తెలియజేయాలని ఎస్సై సూచించారు.

విద్యార్థిని ప్రసవం ఘటనలో ఇద్దరి అరెస్ట్

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మిషనరీ కాన్వెంట్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని (నన్) మగ్గ బిడ్డను ప్రసవించడం, బిడ్డ మరణించిన సంఘటనలో ఇద్దరిని వ్యక్తులను ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అశోక్‌నగర్‌లోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో చదువుకుంటున్న ఒక విద్యార్థిని (16) ఈనెల 8న తెల్లవారుజామున మగ బిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డను మూడో అంతస్థు నుంచి కిందికి పడవేశారు. మరణించిన తరువాత పడేశారా, పడేసిన తరువాత మరణించిందా అనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడి కావాల్సి ఉంది. అక్కడికి ట్యూషన్ చెప్పడానికి వచ్చే ఒక బ్రదర్ (పాస్టర్‌గా శిక్షణ పొందుతున్న వ్యక్తి) ఆ బాలికను లోబరుచుకుని గర్భవతిని చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అయితే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేసి ఆ సమీపంలోనే ఎదురుగా ఉన్న బాష్యం స్కూలు ఆఫీసర్ బాయ్, దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరి అఖిల్ (24)ను అరెస్టు చేశారు. అతడు కూడా ఆ విద్యార్థినిని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామానికి చెందిన దండు రాజీవ్ (30) ఏలూరులో బ్రదర్‌గా శిక్షణ పొందుతూ ట్యూషన్ చెప్పడానికి సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌కు వచ్చేవారు. ఇతను కూడా ఆ విద్యార్థినిని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడ్డాడనే అభియోగంతో 21న ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అరెస్టు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

క్రైమ్ కార్నర్

నగల దుకాణం సీజ్

» తాడేపల్లిగూడెంలో తనిఖీలు
» పెరుగుతున్న బాధితులు
» ఆరు కేజీల బంగారం, వంద కేజీల వెండి రికవరీ

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో హోల్‌సేల్ బంగారు వ్యాపారులకు, ఖాతాదారులకు కుచ్చుటోపి వేసిన మాన్సీ జ్యూయలర్స్‌ను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. ఇప్పటికే వ్యాపారి లంకా రమణబాబు చాలామంది దగ్గర సొమ్ములు, వజ్రాల ఆభరణాలు, వెండి ఆభరణాలు తీసుకుని కనిపించకుండా పోలీసులు నిర్ధారించారు. గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఆయన నివాసం, బంధువుల ఇళ్లు, షాపు తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే 100 కేజీల వెండి, 6 కేజిల బంగారం స్వాదీనం చేసుకున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు. తాజాగా ఆదివారం బంగారు దుకాణం తెరిచి తనిఖీలు నిర్వహించారు. బంగారం వ్యాపారి చేతుల్లో మోసపోయిన వారి జాబితా రోజు రోజుకు పెరుగుతోంది. ఇదిలాఉండగా మరి కొంత మంది లెక్కల్లో లేని బంగారం కూడా పట్టుకుపోవడంతో కొందరు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నారని సమాచారం. ఇప్పటికే వంద కేజీల వెండి, ఆరు కేజీల బంగారం స్వాదీనం చేసుకున్న పోలీసులు మరింత చోరీ సొత్తు బయట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సీఐ సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేస్తున్నారు.

వాష్ రూంలో విద్యార్థినుల ఫొటోలు తీసిన ఆకతాయిలు

పోక్సో కేసు నమోదు

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాష్ రూంకు వెళ్లిన విద్యార్థినులను ఇద్దరు ఆకతాయిలు చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశారు. కొందరు విద్యార్థులను రోజూ వెంబడించడం, అసభ్యకరంగా సైగలు చేస్తున్నారని వారిపై ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై శనివారం పాఠశాల విద్యా కమిటీ ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుధీర్ ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేంపాడుకు చెందిన పెండ్లి సందీప్‌కుమార్, జోనుబోయిన జితేంద్ర ఈ అకృత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థినులు శుక్రవారం ఉదయం బాత్రూంకు వెళ్లారు. ఆకతాయిలు సమీపంలోని చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడం గమనించిన విద్యార్థినులు ఉపాధ్యాయులకు చెప్పారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పారిపోయారు. తర్వాత విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం ఉదయం పాఠశాలకు చేరుకుని తమ పిల్లలకు పాఠశాలలో భద్రత లేదని ఆందోళన చేశారు. ఉపాధ్యాయుల తీరును దుయ్యబట్టారు. దీంతో సచివాలయ మహిళా పోలీస్ విద్యార్థినుల నుంచి రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం సందర్శనకు అనుమతి తప్పనిసరి

» విద్యార్థులను అడ్డుకున్న సెక్యూరిటీ
» తర్వాత అనుమతించిన అధికారులు



ప్రాజెక్టు యాత్రకు వచ్చిన స్కూలు బస్సులు

పోలవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గొల్లలమామిడాడ ప్రైవేటు స్కూలు విద్యార్థులు ఆదివారం పోలవరం ప్రాజెక్టు సందర్శించారు. ఏడు బస్సుల్లో 350 మంది విద్యార్థులు అక్కడికి చేరుకోగా అనుమతి లేదని ప్రాజెక్టు భద్రతా బలగాలు అడ్డుకున్నారు. 100 కిలో మీటర్ల నుంచి వచ్చామని, అనుమతించాలని కోరినా భద్రతా సిబ్బంది అంగీకరించ లేదు. ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించడంతో ఈఈ వెంకటరమణ విద్యార్థులను ప్రాజెక్ట్ సందర్శనకు అనుమతించారు. స్పిల్‌వే, ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శనపై సీఈ నరసింహమూర్తిని వివరణ కోరగా ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. వెసులుబాటుని బట్టి సంబంధిత ఇంజనీర్లు డెమో ఇస్తారని ఆయప తెలిపారు.

నేడు పశువైద్య శిబిరం

ఉంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమవారం నాడు బొమ్మిడిలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఉంగుటూరు పశు వైద్యాధికారిణి డాక్టర్ బి.శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. పెంటపాడు పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి: బండి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పని చేస్తున్న జట్టు, లాగుడు బండ్లు, ముఠా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు మెయిన్‌బజారులోని సెంటర్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు నగర జట్టు, లాగుడు బండ్ల కార్మిక సంఘం 54వ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తోం దన్నారు. రానున్న మరో పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



త్వరలో జనసేన కమిటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు కాశీ నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి అనంతరం పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. మన్యం ప్రాంతాల అభివృద్ధికి పవన్ కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, కె.సాయితేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

భజన కళాకారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధ ఆలయాల్లో పని చేస్తున్న భజన కళాకారులందరికీ రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, సకల కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు మండల అధ్యక్షుడు శ్రీహరికోటి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కూల్చివేసిన అన్నమయ్య నివాసాన్ని పునః నిర్మించి అక్కడే అన్నమయ్య, హనుమంతుడి విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. భజన నేర్పే గురువులకు కూడా రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఏ.వి.ఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జీవీఎల్ నరసింహారావు, సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు పాల్గొన్నారు.

బంకా రామ్మోహన్‌రావు మృతికి సంతాపం



ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త, కళాభిమాని, వైఎంహెచ్‌ఏ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు బంకా రామ్మోహన్‌రావు ఆకస్మిక మృతి పట్ల వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఏలూరులో పలు ఆధ్యాత్మిక, ధార్మిక కళాసంస్థల్లో సభ్యుడిగా ఆయన విశేష సేవలు అందించారని, ఆయన మృతి కళారంగానికి తీరని లోటన్నారు. ఆయన మృతికి వైఎంహెచ్‌ఏ మేనేజ్ మెంట్ కమిటీ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కేవీ వెంకట రమేష్, జవ్వాజి మోహన్ విఠల్, మజ్జి కాంతారావు తీవ్ర సంతాపం తెలిపారు.

మూడో రోజూ పారిశుధ్య కార్మికుల నిరసన

చింతలపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు, మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరసన ఆదివారానికి మూడో రోజుకు చేరింది. పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవని, కుటుంబాలు పండుగ సమయంలో ఇబ్బందులు పడుతున్నాయని కార్మిక నాయకుడు బాబు పేర్కొన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుకు సత్కారం

ఉంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివారం విజయవాడలో ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఆయనను సంఘ ప్రతినిధులు సత్కరించినట్టు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.



పాత పోలవరంలో మంచినీటి పైపులైన్లు పగిలి నీరు బయటకు వస్తున్న దృశ్యం

మళ్లీ మొదటికి..

పైప్‌లైన్లకు మరమ్మతులు.. సత్యసాయి తాగునీటి పంపిణీకి కష్టాలు

పోలవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సత్యసాయి మంచినీటి పంపిణీకి మళ్లీ ఇబ్బందులెదురయ్యాయి. రెండు వారాలుగా యడ్లగూడెం సెంటర్‌లో పైపులైన్లు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోగా శనివారం ఉదయానికి సత్యసాయి కార్మికులు పైపులైన్లు సరిచేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. అయితే పంచాయతీ డ్రెయిన్ల నిర్మాణం కోసం పాత పోలవరం గ్రామంలో రోడ్డు పక్కన పంచాయతీ కార్మికులు చేపట్టిన తవ్వకాలలో పైపులైన్లు రెండు ప్రాంతాల్లో పగిలి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మంచినీటి పంపిణీ చేసిన ఒక్కపూటలోనే నీటి పంపిణీ నిలిచిపోవడంతో సత్యసాయి కార్మికులు మరమ్మతులు పూర్తి కావడానికి మరో వారం రోజులు పడుతుందని తెలపడంతో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. శాశ్వత ప్రాతిపదికన మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై సీపీఎం ఆందోళన

ఉంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆదివారం చేబ్రోలులో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలను తక్షణమే తగ్గించాలని ఆదానితో ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నినాదాలు చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణారావు, మండల నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం



హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

పెదవేగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ వ్యవస్థ ప్రక్షాళనే ప్రధాన లక్ష్యంగా నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. వచ్చే నెల 5న గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం సభ కరపత్రాలను వీహెచ్ పీ, ఆర్ఎస్ఎస్ నాయకులతో కలసి దుగ్గిరాల కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, మేడిశెట్టి పాములు, కట్నేని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న జరగబోయే హైందవ శంఖారావం బహిరంగ సభకు సంబంధించి ఏలూరులో సన్నాహక సమావేశం ఆదివారం వీహెచ్‌పీ జిల్లా కార్యాలయంలో జరిగింది. పరిషత్ అంతర్జాతీయ కమిటీ సభ్యులు వై రాఘవులు మాట్లాడుతూ ఆలయాల నిర్వహణ హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రవ్యా ప్తంగా హిందువులు శంఖారావానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్నేని కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

పెదవేగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 2006లో 12వ తరగతి వరకు కలిసి, చదువుకున్న పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ) పూర్వ విద్యార్థులు ఆదివారం వారంతా తాము చదివిన పాఠశాలకు వచ్చి రోజంతా ఆడి, పాడారు. చిన్ననాటి సంగతులను జ్ఞప్తికి తెచ్చుకుని మురిసిపోయారు. రోజంతా హాయిగా గడిపారు. 25 ఏళ్ళనాడు పెదవేగి జేఎన్వీలో 12వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో 35 మంది కుటుంబ సభ్యులతో సహా జేఎన్వీకి వచ్చారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు నాగరాజకుమార్, వీబీకే మూర్తి, శేఖర్ బాబు, దుంపా శ్రీనివాసరావు, శాంతారావు, పి.కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, ఎస్‌పీ సుజాత, లక్ష్మణరావు తదితరులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు కెప్టెన్ టీవీఎస్ రావు, సింహాచలం మాట్లాడుతూ ఆరోజున గురువులు చూపిన మార్గంలో పయనించబట్టే ఈరోజున తమ భవిష్యత్ ఉజ్వలంగా ఉందని చెప్పారు. జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవలు కీలకం

కుక్కునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో రోగులకు అందుబాటులో ఉంటూ అత్యవసర వైద్యసేవలను గ్రామీణ వైద్యులందిస్తున్నారని వారు చేసే ప్రథమ చికిత్స ఎంతో ముఖ్యమని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే.దైవ ప్రసాద్ అన్నారు. ఆదివారం గ్రామీణ వైద్యుల సమావేశం కుక్కునూరులో జరిగింది. ప్రభుత్వం తరపున గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి వారి సేవలను మెరుగుపరచాలని కోరారు. ఎస్‌కే చాంద్ బాషా, ఎం.వెంకటరమణ, నాని తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కుక్కునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో కుచ్చెర్లపాటి రామకృష్ణంరాజు మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఎస్సై రామకృష్ణ, ఎంపీపీ సీహెచ్.గీతావాణి ప్రారంభించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. దివంగత టీడీపీ నేత కుచ్చెర్లపాటి రామకృష్ణంరాజు పేరిట క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. టీడీపీ నాయకులు ముప్పాల సాంబశివరావు, వెంకట రామారావు, కుచ్చెర్లపాటి అప్పలరాజు, ముప్పాల సత్యనారాయణ, వై.నాగేంద్రరావు, మురళీ మోహన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండు వద్ద దళిత, యువజన సంఘాల నిరసన

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనందశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ దళిత, గిరిజన యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

భీమడోలు: అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా భీమడోలు సంతమార్కెట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఆర్. లింగరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోగులమూడి ప్రసాదరావు, న్యాయవాది రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న దృశ్యం

క్రీస్తు మార్గంలో పయనించాలి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, దయ, క్షమాగుణాలతో ప్రతి ఒక్కరు జీవించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అన్నారు. బిషప్స్ హౌస్‌లో ఆదివారం సెమిక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో శాంతిని నెలకొల్పడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడన్నారు. ముందుగా కేకును కట్ చేశారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, టీడీపీ నేతలు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



మన్నా చర్చిలో ఎమ్మెల్యే రోషన్‌కు సత్కారం

● తోటివారికి సహాయ పడటమే క్రీస్తు చూపిన బాట అని చింతలపూడి ఎమ్మెల్యే వంగా రోషన్‌కుమార్ అన్నారు. శాంతినగర్‌లో ఆదివారం మన్నా చర్చ్‌లో జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మన్నాచర్చ్ బిషప్ ఎం.ఎలీషారాజు, పాస్టర్ ఎం.జ్యోతిరాజు, విశ్వాసులు పాల్గొన్నారు. సండేస్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

సాగునీటి ఇబ్బందులు రానివ్వం



దెందులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలంలో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామని గోదావరి కాల్వ (పోతునూరు) డీసీ ఛైర్మన్ వెలమాటి రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని దెందులూరు-సత్యనారాయణపురం జాతీయ రహదారి సమీపం అండర్‌పాస్ వద్ద సీతంపేట కాల్వ, గోదావరి అనుసంధాన తూము వద్ద పూడిక తీత పనులను సత్యనారాయణపురం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రంగారావు, గుండుగొలను గోదావరి కాల్వ ఇరిగేషన్ కాల్వ ఏఈ సుబ్రమణ్యం(సుబ్బు)తో కలిసి రాంబాబు పరిశీలించి మాట్లాడుతూ వరి ఊడుపులు ప్రారంభమయ్యే సమయానికి రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పూర్తయిన విచారణ

టి.నరసాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ పూర్తయినట్టు జంగారెడ్డిగూడెం డీఎల్పీఓ ఎండీ రజావుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుకు పరిష్కార పత్రాన్ని అందచేసి మాట్లాడుతూ ఇటీవల బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. నెలరోజులు విచారణ చేసి నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించి బాధ్యులపై చర్యలు చేపట్టి దుర్వినియోగం అయిన నిధులు వెనక్కి రాబట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి సిఫారసు చేస్తూ నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు.




ద్వారకాతిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు



పుష్పాలంకరణలో సూర్యనారాయణస్వామి



మండలపర్రులో శ్రీ మహారుద్ర హోమం



గుబ్బల మంగమ్మ ఆలయంలో భక్తులు

ఆధ్యాత్మికం

ద్వారకా కిటకిట..

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా అంటూ భక్తుల గోవింద నామస్మరణతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. సెలవు దినంతో పాటు మార్గశిరం మాసం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు క్షేత్రానికి చేరుకుని క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. విజయవాడలో చండీ హోమాన్ని పురస్కరించుకుని తిరుగు ప్రయాణాల్లో భవానీ భక్తులు ఇక్కడకు అధిక సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సూర్యనారాయణస్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్: ధనుర్మాసం, ఆదివారం కావడంతో పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీ ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయంలో భక్తులు సామూహిక అభిషేకాలు, సూర్య నమస్కారాలు జరిపారు. స్వామివారికి, స్ఫటిక లింగానికి పంచామృతాభిషేకం చేశారు.

కామవరపుకోట: స్థానిక శ్రీ లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో ఆదివారం భక్తులు సామూ హిక ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపారు. శ్రీచక్రానికి గోక్షీరాభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసా చార్యులు భక్తులతో పూజలు చేయించారు. తిరుప్పావై ప్రవచనాలు చేసి గోదాదేవిని ఆరాధించారు.

మండలపర్రులో శ్రీమహారుద్ర హోమం

నిడమర్రు: రుద్ర హోమం మనిషిలో ఉన్న రుగ్మతలను నశింపజేస్తుందని, అందువల్ల అందరూ ఈ యజ్ఞంలో పాల్గొనాలని ప్రముఖ వైదిక జ్యోతిష్య పరిశోధకులు రాఘవేంద్ర సాయిశర్మ అన్నారు. ఆదివారం మండలపర్రు ఉమా నీల కంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో శ్రీ మహారుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయం కిటకిట

బుట్టాయగూడెం: మన్యంలో కొలువైన గుబ్బల మంగమ్మను దర్శించుకునేందుకు ఆదివారం వందలాదిగా భక్తులు ఏజెన్సీకి తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వెయ్యి మందికిపైగా అమ్మవారిని దర్శించుకున్నారని కమిటీ తెలిపింది.

దుర్గమ్మ దర్శనానికి భవానీలు..

కొయ్యలగూడెం: విజయవాడ దుర్గమ్మ ఆలయానికి భవానీమాల వేసుకున్న భక్తులు బయల్దేరారు. ఆదివారం స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద ఇరుముళ్ళు కట్టుకుని అన్ని ఆలయాలు సందర్శించి విజయవాడ బయల్దేరారు. సోమవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుంటామని భక్తులు తెలిపారు.

పెదవేగి: రాట్నాలమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. సంక్రాంతి పండుగ నెల కావడంతో అమ్మవారికి మొక్కుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్య నారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ సహిత దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా రుసుములు రూ.24,190లు, లడ్డూ ప్రసా దాల విక్రయాల ద్వారా రూ.12,225లు, ఫొటో విక్రయాల వల్ల రూ.1295లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.



చిన వెంకన్నకు గుడివాడ ఎమ్మెల్యే పూజలు

ద్వారకాతిరుమల: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ద్వారకా తిరుమలకు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కాగా ఆయన గెలుపు కోసం మొక్కుకున్న పలువురు అభిమానులు నడిచి వచ్చి మొక్కు తీర్చుకుని ఎమ్మెల్యేతో ఫొటోలు దిగారు.



అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అంబళ్ల కార్తీక్



ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న ఏలూరుకు చెందిన వెయిట్ లిఫ్టర్ అంబళ్ల కోమల కార్తీక్ ఖతార్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అతను ఇటీవల పాటియాలాలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం, అఖిల భారత విశ్వవిద్యాలయాల పోటీల్లో రజత పతకం సాధించాడు. తాజాగా 96 కేజీల విభాగానికి సంబంధించి ఖతార్‌లో జరుగుతున్న ఆసియన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఏలూరు ఇండోర్ స్టేడియం వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం. రమేష్‌బాబు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు బడేటి వెంకట్రామయ్య, టి. దిన్నాబాబు తదితరులు అభినందించారు.



ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

ఏలూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో స్టేట్ లెవల్ ఖేలో ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో సండే సైక్లింగ్ నిర్వహించారు. జాతీయ అథ్లెటిక్స్ పతక విజేత డి.ప్రసాద్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆయుర్దాయం పెరుగుతుందన్నారు. అథ్లెటిక్ కోచ్ ప్రీతి చౌదరి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఖేలో ఇండియా సెంటర్ ఇన్‌చార్జ్ వినాయక్ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఏపీటీయూ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

ఏలూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీయూ జిల్లాశాఖ అధ్యక్షుడిగా ఎన్.ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక వివరాలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు విలేకరులకు తెలిపారు. ఉద్యోగులకు డీఏ బకాయిలను విడుదల చేయాలని, వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ రూపొందించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రత్యేక తరగతుల నుంచి ఆదివారం, సంక్రాంతి పండుగ సెలవుదినాలను మినహాయించాలని డిమాండ్ చేశారు.

టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా బాలానందం

భీమడోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ ఏలూరు జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఉండవల్లి బాలానందం ఎంపికయ్యారు. ఐటీడీపీ కార్యదర్శిగా ఉన్న ఆయనకు ఈ పదవి లభించినట్టు ప్రకటనలో తెలిపారు. అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసిన ఎంపీ పుట్టా మహేష్, గన్ని వీరాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో పింఛను లబ్ధిదారుల ఎంపిక : ఎమ్మెల్యే బడేటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రతి రోజు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నానని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత మేర పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే కొత్తగా లబ్ధిదారులను గుర్తించి పింఛన్లు అందజేస్తామన్నారు.

గ్రంథ పఠనం ఉజ్వల భవిష్యత్‌కు పునాది

పెదవేగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రంథ పఠనం ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలో శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ పుస్తక పఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి : ఏపీఎస్టీయే

ఏలూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు ఏర్పాటుచేసిన హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని ఏపీఎస్టీయే రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్, జిల్లాశాఖ నాయకులు వెంకట రమణ, ప్రసాద్ డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌లను ఎత్తివేసే బదులు వాటికి ల్యాబ్ సౌకర్యం కల్పించి, మండలానికో ప్లస్ టూ పాఠశాలను కో-ఎడ్యుకేషన్ విధానంలో ఏర్పాటుచేసేలా ప్రభుత్వం పునరాలోచించాలని అభ్యర్థించారు. అన్ని హైస్కూల్ ప్లస్‌లలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ ఈసీ, సీఈసీ గ్రూపులుండేలా చూడాలన్నారు. కేవలం విద్యార్థుల సంఖ్య తక్కువ అనే నెపంతో మొత్తం వ్యవస్థను రద్దుచేయడం సరైంది కాదన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఆరుగురి అరెస్టు

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం బీడీ కాలనీ ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి కొంత మంది పేకాడుతున్నట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గాప్రసాద్‌కు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి 19 వేల 20 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ప్రసవం ఘటనలో ఇద్దరి అరెస్ట్

ఏలూరు క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మిషనరీ కాన్వెంట్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక విద్యార్థిని (నన్) మగ్గ బిడ్డను ప్రసవించడం, బిడ్డ మరణించిన సంఘటనలో ఇద్దరిని వ్యక్తులను ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అశోక్‌నగర్‌లోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో చదువుకుంటున్న ఒక విద్యార్థిని (16) ఈనెల 8న తెల్లవారుజామున మగ బిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డను మూడో అంతస్థు నుంచి కిందికి పడవేశారు. మరణించిన తరువాత పడేశారా, పడేసిన తరువాత మరణించిందా అనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడి కావాల్సి ఉంది. అక్కడికి ట్యూషన్ చెప్పడానికి వచ్చే ఒక బ్రదర్ (పాస్టర్‌గా శిక్షణ పొందుతున్న వ్యక్తి) ఆ బాలికను లోబరుచుకుని గర్భవతిని చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అయితే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేసి ఆ సమీపంలోనే ఎదురుగా ఉన్న బాష్యం స్కూలు ఆఫీసర్ బాయ్, దెందులూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరి అఖిల్ (24)ను అరెస్టు చేశారు. అతడు కూడా ఆ విద్యార్థినిని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామానికి చెందిన దండు రాజీవ్ (30) ఏలూరులో బ్రదర్‌గా శిక్షణ పొందుతూ ట్యూషన్ చెప్పడానికి సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌కు వచ్చేవారు. ఇతను కూడా ఆ విద్యార్థినని లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడ్డాడనే అభియోగంతో 21న ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అరెస్టు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వాష్ రూంలో విద్యార్థినుల ఫొటోలు తీసిన ఆకతాయిలు

పోక్సో కేసు నమోదు

ద్వారకాతిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వాష్ రూంకు వెళ్లిన విద్యార్థిను లను ఇద్దరు ఆకతాయిలు చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశారు. కొందరు విద్యార్థులను రోజూ వెంబడించడం, అసభ్యకరంగా సైగలు చేస్తున్నారని వారిపై ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై శని వారం పాఠశాల విద్యా కమిటీ ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం తో ఎస్‌ఐ సుధీర్ ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేంపాడుకు చెందిన పెండ్లి సందీప్‌కుమార్, జోనుబోయిన జితేంద్ర ఈ అకృత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థినులు శుక్రవారం ఉదయం బాత్రూంకు వెళ్లా రు. ఆకతాయిలు సమీపంలోని చెట్టుపై నుంచి సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడం గమనించిన విద్యార్థినులు ఉపాధ్యాయులకు చెప్పారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పారిపోయారు. తర్వాత విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం ఉదయం పాఠశాలకు చేరుకుని తమ పిల్లలకు పాఠశాలలో భద్రత లేదని ఆందోళన చేశారు. ఉపాధ్యాయుల తీరును దుయ్యబట్టారు. దీంతో సచివాలయ మహిళా పోలీస్ విద్యార్థినుల నుంచి రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్నిహితురాలి ఇంట్లోనే చోరీ

18 కాసుల బంగారం..
రూ.1.5 లక్షల నగదు స్వాధీనం

భీమవరం క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్, జూదం, వ్యసనాలకు అలవాటు పడిన వ్యక్తి తన సన్నిహితురాలి ఇంట్లోనే బంగా రం, నగదు అపహరించి పోలీసులకు పట్టుబడ్డాడు. భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. భీమవరం మండలం ఎల్‌విఎన్ పురం గ్రామానికి చెందిన వీరవల్లి కృష్ణమోహన్‌కు భీమవరం బలుసుమూడికి చెందిన పాతర్లపల్లి మాలతితో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. మాలతి భర్తకు దూరంగా ఉంటూ సున్నం ఆంజనేయులు అపార్ట్‌మెంట్ ఏజీ-4లో నివాసం ఉంటుంది. వారిద్దరి మధ్య సన్నిహితం ఏర్పడింది. ఇదిలా ఉండగా వ్యసనాలకు బానిస అయిన కృష్ణమోహన్ దొంగతనం చేయాలని నిర్ధారించుకున్నాడు. మాలతి జూన్ 1న ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. అది గమనించిన కృష్ణమోహన్ అదే నెల 4న మాలతి ఇంటి తాళాలు పగులగొట్టి 18 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.5లక్ష ల నగదు అపహరించాడు. బీరువాలో బట్టలు చిందరగా పడవేసి ఇంట్లో కారం చల్లి దొంగలు దొంగతనం చేసినట్లు చేసి వెళ్ళిపోయాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన మాలతి ఇంట్లో దొంగలు పడ్డారని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణమోహన్ మాత్రం ఏమీ తెలియనట్లుగా మాలతి వద్దకు వెళ్ళి ఓదార్చేవాడు. దొంగిలించిన సొమ్మును అవసరాలకు వాడుకుని బంగారాన్ని విక్రయించడానికి ఈ నెల 21న పాత బస్టాండ్ వద్ద తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బంగారాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించడానికి జిల్లా ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి డీఎస్‌పి జయసూర్య ఆధ్వర్యంలో సీఐ కాళీచరణ్, ఎస్‌ఐ రెహ్మాన్, ఏఎస్‌ఐ వర్మ, హెచ్‌సి గోవిందరాజులు, సిబ్బంది గోపి, నరేష్ కృషి చేశారు. అధికారులు అభినందించి నగదు బహుమతులను ప్రకటించారు.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి : ఏపీఎస్టీయే

ఏలూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఇంటర్ విద్యనం దించేందుకు ఏర్పాటుచేసిన హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని ఏపీఎస్టీయే రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్, జిల్లాశాఖ నాయకులు వెంకట రమణ, ప్రసాద్ డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌ను ఎత్తివేసే బదులు వాటికి ల్యాబ్ సౌకర్యం కల్పించి, మండలానికో ప్లస్ టూ పాఠశాలను కో-ఎడ్యుకేషన్ విధానంలో ఏర్పాటుచేసేలా ప్రభుత్వం పునరాలోచించాలని అభ్యర్థించారు. అన్ని హైస్కూల్ ప్లస్‌లలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులుండేలా చూడాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువ అనే నెపంతో మొత్తం వ్యవస్థను రద్దుచేయడం సరైంది కాదన్నారు.


వాకర్స్ సభ్యుల ఆధ్వర్యంలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

వాకర్స్ అసోసియేషన్ సెమీ క్రిస్మస్ వేడుకలు

కైకలూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కైకలూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి 44వ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలల్లో స్వర్ణ, రజతం, కాస్యం పతకాలు సాధించిన క్రీడాకారులు ఎంఎస్ రాజు, తెంటు నాగేశ్వరరావు, కె.ఫౌంటెన్, ఎండీ గాలిబ్‌బాబులను ఘనంగా సత్కరించారు. ప్రతీరోజూ వాకర్స్ సభ్యులతో కలిసి రన్నింగ్, వాకింగ్, జంపింగ్ వంటి క్రీడల్లో రాణించి స్వర్ణ పతకాలు సాధించడం కైకలూరుకు గర్వకారణమని వాకర్స్ సభ్యులు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు కారే శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


సాగునీటిసంఘం అధ్యక్షుడు కృష్ణారావును సత్కరిస్తున్న కూటమి నాయకులు

బొల్లెంపల్లి ఆర్థిక సహకారంతో పేదలకు అన్నదానం

కైకలూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కైకలూరు అన్న క్యాంటీన్‌లో భైరవపట్నం సాగునీటి సంఘం అధ్యక్షుడు బొల్లెంపల్లి కృష్ణారావు ఆర్థిక సహకారంతో పేదలకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం కైకలూరులో అన్న క్యాంటీన్‌లో 187వ రోజు దాత కృష్ణారావు ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరరావు తదితర నాయకులు కృష్ణారావును ఘనంగా సత్కరించారు. మరింతమంది దాతలు ముందుకొచ్చి అన్న క్యాంటీన్‌లో ద్వారా మరింతమంది పేదలకు అన్నదానం చేసేందుకు కృషి చేయాలన్నారు.

‘తెలుగు మీడియంను కొనసాగించాలి’

కైకలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మీడియంను కొనసాగించాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఎస్ రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. తెలుగుభాష ఎంతో మధురమైనదని ఈ భాషను అన్ని పాఠశాలల్లో కొనసాగిస్తూ దీంతో పాటు ఇంగ్లీషును విద్యార్థులకు నేర్పేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పూర్తిగా తెలుగుభాషను విస్మరించి ఇంగ్లీషు భాషపై మక్కువ చూపితే రానున్న రోజుల్లో మాతృభాష కరువయ్యే పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఇంగ్లీషుకు ప్రాధాన్యత ఇస్తూనే తెలుగుభాషను కొనసాగించాలని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మాతృభాషకు ఇస్తున్న ప్రాధాన్యతను గమనించాలన్నారు. మేధావులు, ఉన్నతాధికారులు, నాయకులు ఆలో చించి ప్రభుత్వానికి సలహా ఇచ్చి తెలుగుజాతి భవిష్యత్తును ఉన్నత స్థితిలో ఉంచాలని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోత

ముసునూరులో వినియోగదారులు, రైతుల పాట్లు


సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ముసునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఉండదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్ సమాచారం కోసం సబ్‌స్టేషన్ నెంబరుకు, ట్రాన్స్‌కో సిబ్బందికి ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదని పలువురు వాపోతున్నారు. వ్యవసాయానికి పగటి పూట 9గంటలు త్రీఫేజ్ విద్యుత్ ఇస్తున్నట్లు చెబుతున్నా రెండు గంటలపైగా విద్యుత్ ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. సింగిల్ ఫేజ్‌లో సైతం రాత్రి, పగలు తేడా లేకుండా గంటల తరబడి కరెంట్ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, చేతి వృత్తుల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో మూడు నుంచి నాలుగు రోజులు సబ్‌స్టేషన్ మరమ్మతులతో లైన్లు బ్రేక్ డౌన్ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ కోతలు అధికమవుతున్నాయని రైతులు, స్థానికులు మండిపడుతున్నారు. మండలంలో ఎక్కడలేని విద్యుత్ కోతలు ఒక్క ముసునూరులో ఎందుకు ఉంటున్నాయని ప్రశ్నిస్తున్నారు. ముసునూరులో విద్యుత్ కోతలు లేకుండా జిల్లా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

ముసునూరులో కొన్నిరోజులు క్రితం విద్యుత్ నిలిపివేత సమయాలు ముందుగా ప్రకటించి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, లైన్లు బ్రేక్‌డౌన్ పనులు పూర్తి చేశాం. ఇక నుంచి ముసునూరులో విద్యుత్ కోతలు ఉండవు. విద్యుత్ సరఫరాపై ప్రజలకు ఫోన్‌చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశాం.

- వీరరాజు, ఇన్‌చార్జి ఏఈ, ట్రాన్స్‌కో


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారెడ్డి

ఘనంగా గణిత దినోత్సవం

నూజివీడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీలో గణితదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ వై.నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిత్య జీవితంలో గణిత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ నూజివీడు ప్రొఫెసర్లు మాచర్ల వెర్రియనాయుడు, రాజేష్ మ్యాథ్స్ రేసర్ వెబ్ అప్లికేషన్‌ను ప్రారంభించారు.

సాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌కు అభినందనలు

నూజివీడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ అళ్ళ గోపాలకృష్ణను ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, లావు ప్రసాద్, పొట్లూరి రవి తదితరులు ఆదివారం కలిసి అభినందించారు. శివారు భూముల వరకు సాగునీరు అందిం చాలని ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని వారు కోరారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సహాయం

నూజివీడు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త సావా విజయశ్రీకి నూజివీడు కాపు కల్యాణ మండపం అభివృద్ధి కమిటీ ఆర్థిక సహాయాన్ని అందించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు కమిటీ సభ్యులు రూ.13వేలు అందించారు. టీవీ మల్లికార్జునరావు, కొల్లా శ్రీనివాసరావు, బండి కిషోర్, నీలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

చాట్రాయి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులంతా తరలివచ్చి జయప్రదం చెయ్యాలని నెక్కలపు వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల రమేష్, బలదా భూషణం కోరారు. చనుబండలో వీహెచ్‌పీ నాయకులు ఇంటింటికి వెళ్ళి హైందవ శంఖారావం కరపత్రాలు అందించి సభకు తరలిరావాలని కోరారు.

● ముసునూరు: ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని చేపట్టిన హైందవ శంఖారావం విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ మండల సమన్వయకర్త చిన్నం శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు దొరయ్య పిలుపునిచ్చారు. ముసునూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయాల రక్షణ కోసం జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు మండలంలోని హిందువులందరూ తరలిరావాలని కోరారు. ప్రభుత్వ ఆధీనంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో విశ్వనాథ్, పవన్ సూర్య, గుడివాడ వెంకటేశ్వరరావు, దేవినేని వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

చాట్రాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో జీవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 29న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని గుత్తా లోకేశ్ తెలిపారు. అన్ని విభాగాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. చాట్రాయి, చింతలపూడి మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. భగవాన్ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నూజివీడు అమెరికన్ హాస్పటల్ సౌజన్యంలో 26న పోలవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జె రంగారెడ్డి తెలిపారు. కంటి వైద్య నిపుణులు కె ప్రభుదాస్ కంటి పరీక్షలు జరిపి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సీ ఎస్టీల గృహాలకు ఉచితంగా సోలర్ విద్యుత్

చాట్రాయి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంలో కింద ఎస్సీ ఎస్టీల గృహాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందజేయనున్నారు. సోలార్ సిస్టం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ ఏఈ సంజయ్ సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సిబ్బందికి బ్యాంకు పాస్ బుక్, కరెంట్ బిల్లు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేస్తే రిజిస్ట్రేషన్ చేయిస్తారని, మండలంలో 3600 మంది ఎస్సీ ఎస్టీలకు గృహ విద్యుత్ కనెక్షలు ఉన్నాయని, అవగాహనతో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

తాగునీటి చెరువు పక్కనే .. అక్రమంగా రొయ్యల సాగు


కొచ్చెర్లలో తాగునీటి చెరువు పక్కన అక్రమంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువు

కలిదిండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొచ్చెర్లలో తాగునీటి చెరువు పక్కన అక్రమ రొయ్యల సాగు చేస్తుండడంతో తాగునీటి చెరువు కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి చెరువు పక్కనే కొన్నేళ్లుగా అనుమతులు లేకుండా సర్వే నెంబర్ 52 -5, 49-1లో అక్రమ రొయ్యల సాగు చేస్తున్నట్టు గ్రామానికి చెందిన కొమరపాలెపు వంశీ మహేశ్ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశాడు. మత్స్యశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ డోలా శంకర్‌ని కలసి దీనిపై ఫిర్యాదు చేశారు. అలాగే ఏలూరులోని కలెక్టరేట్ సోమవారం జరిగే పీఆర్‌జీఎస్‌లో, కలిదిండి తహసీల్దార్, ఎంపీడీవో, కార్యదర్శి, వీఆర్వోకి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని వివరించారు. గ్రామకంఠం భూమికి అబద్ధపు సాక్ష్యాలతో డాక్యుమెంట్ పుట్టించి గృహ నివాసాల కోసం ఉపయోగించాల్సిన భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువుగా మార్చి తాగునీటి చెరువు గట్టుని రొయ్యల చెరువు గట్టుగా ఉపయోగించి కలుషితం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ రామకృష్ణ, మండల మత్స్యశాఖాధికారి రవికుమార్‌ను వివరణ కోరగా, కొచ్చెర్లలో తాగునీటి చెరువు పక్కన అక్రమ రొయ్యల చెరువు సాగుదారుడికి నోటీసు జారీ చేశామన్నారు. గ్రామ కంఠంలో ఉన్న అక్రమ రొయ్యల చెరువును స్వాధీనం చేసుకుంటామన్నారు.


పెదగొన్నూరులో గంగానమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

కోలాహలంగా గంగానమ్మ జాతర

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెదగొన్నూరులో ఆదివారం గంగానమ్మ జాతర కోలాహలంగా జరిగింది. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు శ్రావణం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారు, పోతురాజుల చలువకుండల ఊరేగింపు వైభవంగా జరిగింది. పంబలోళ్ల నాయకుడు వీరులపాడుకు చెందిన రామారావు ఆధ్వర్యంలో ఆచార సంప్రదాయాల ప్రకారం అమ్మవారి జాతర నిర్వహించారు. అనంతరం కొర్లబండాని సాగనంపారు.


సింగరాయపాలెంలో భవానీ మాలధారులకు అన్నదానం

కాలినడక భవానీలకు అన్నదానం

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దీక్షల విరమణకు వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే భవానీ మాలాధారులకు ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో నాగేశ్వరరావు, దుర్గమ్మ గురు భవానీల ఆధ్వర్యంలో ఎలక్ట్రిషియన్ నాగరాజు భవానీ ఈ అన్నదానం నిర్వహిస్తున్నారు. సింగరాయపాలెంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం పక్కనే ఏర్పాటు చేసిన శిబిరంలో భవానీలు, ఇతర మాలాధారులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.


దేవదూతల వేషధారణలో చిన్నారులు

సెమీ క్రిస్మస్ వేడుకలు

ముసునూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెరాక ప్రార్థన మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఏసుక్రీస్తు జననంతో లోకానికి వెలుగు వచ్చిందని, ఆయన చూపిన ప్రేమ మార్గంలో నడవాలని పాస్టర్ రత్నకుమారి ఉద్బోధించారు. చిన్నారులు, మహిళలు క్రీస్తు జననంపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి భావాన్ని నింపాయి. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.


మిల్లుకు ఎగుమతి చేస్తున్న ధాన్యం

15,477 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

చాట్రాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు జోరుగా సాగుతోంది. 24 గంటలలోపు రైతుల ఖాతాలలో సొమ్ము జమ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో మొత్తం 15,477 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.24.50 కోట్లు రైతులకు చెల్లించారు. బూరుగ్గూడెంలో 1871 మెట్రిక్ టన్నులు, చనుబండలో 1782, నరశింహరావుపాలెంలో 1923, పోలవరంలో 1712, చనుబండలో 1755, చాట్రాయిలో 1309, చీపురుగూడెంలో 557, చిన్నంపేటలో 1171, చిత్తపూరులో 1291, కోటపాడులో 1485, కొత్తగూడెంలో 713, మర్లపాలెంలో 778, పోతనపల్లిలో 615, తుమ్మగూడెంలో 851 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

సత్వరమే చెల్లింపులు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం కావడానికి యంత్రాంగం కృషి చేసింది. ప్రభుత్వ సత్వరమే చెల్లింపులు చేయడం వలన దాదాపు రైతులందరూ మద్దతు ధరకు ధాన్యం అమ్ముకొని లాభపడ్డారు. రైతులు సంతోషంగా ఉండడం వ్యవసాయ శాఖ సిబ్బందికి ఎంతో అత్మ సంతృప్తిని ఇచ్చింది.

- శివశంకర్, ఏవో, చాట్రాయి మండలం


కొత్తపల్లిలోని ఆర్‌సీఎం చర్చి

చర్చిల ముస్తాబు

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ ప్రార్థనామందిరాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. ముదినేపల్లి, కొత్తపల్లిలోని ఆర్‌సీఎం ప్రధాన చర్చిలతో పాటు, మండలంలోని సీఎస్ఐ, ఇతర చర్చిలను వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద క్రీస్తు జననం, శిలువ ధారి చిత్రాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. కొత్తపల్లిలోని ఆర్‌సీఎం చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. మందిర ఫాదర్ తలమాల జై రాజు ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కలిదిండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెదలంకలో ఆదివారం దున్న పరశురామయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు దున్న భోగేశ్వరరావు పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయటానికి దాతలు ముందుకు రావాలన్నారు. తెలుగు రైతు ఉపాధ్యక్షుడు దుగ్గిరాల పరమేశ్వరరావు, టీడీపీ నాయకులు అక్కల వెంకటాచలం, దున్న శ్రీనివాసరావు, పోకల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు దున్న భోగేశ్వరరావు, నాయకులు


మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

పీవీ రావుకు ఘన నివాళులు

ముదినేపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ముదినేపల్లిలోని అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించారు. మాలమహా నాడు (పివి.రావు) రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల క్షేమం కోసం చేస్తున్న పోరాటంలో పి.వి.రావు ప్రాణాలు వదిలారని నాయకులు పేర్కొన్నారు. మాలమహానాడు, అంబేడ్కర్ యూత్ నాయకులు కొప్పుల నాగరాజు, మేడపాటి జగదీష్, సేవా సంజయ్, సేవా వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.